గణపయ్యా.. ఇదేమిటయ్యా!

- లక్ష్మీనారాయణ చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 21 : వినాయక నిమజ్జనాన్ని ఎంతో పకడ్బందీగా నిర్వహించిన అధికారులు చెరువులో వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని తొలగించడంలో విఫలమయ్యారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో అధికారులు వినాయక నిమజ్జనం విజయవంతంగా పూర్తి చేశారు. నిమజ్జనంతో చెత్తచెదారం, పూజా సామగ్రి చెరువు కట్టపై దర్శనమిస్తోంది. ముందే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో చెత్తాచెదారాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. కానీ నిమజ్జనం పూర్తై నాలుగురోజులు గడుసున్నా చెరువులోని వ్యర్థాలను తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. వినాయకులు నీటిలో మునుగక ముందే వాటిపైనే నిమజ్జనం చేయడంతో విగ్రహాలు నీటిలో తేలుతున్నాయి. ఇప్పటికే ఎరిమల్లే వాగు నుంచి వస్తున్న వ్యర్థాలతో ఇబ్బందులు పడుతుంటే ప్రస్తుతం వినాయక నిమజ్జనాలు చేసి ఇంకా చెరువును కలుషితం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు చెత్త చెదారాన్ని తొలగించాల్సిన మున్సిపల్ అధికారులు నిమజ్జనం పూర్తియ్యాక అటువైపు కన్నెత్తి చూడడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి చెరువులోని వినాయక విగ్రహాల వ్యర్థాలను తొలగించి చెరువును పరిరక్షించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో వ్యర్థాలు





మంబాపూర్‌లో కురుస్తున్న వాన

దంచికొట్టిన వాన

పెద్దేముల్/ఘట్‌కేసర్, సెప్టెంబరు 21: వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. పెద్దేముల్ మండలంలో వాన దంచికొట్టింది. జోరు వర్షానికి జనం ఇబ్బందులు పడ్డారు. కాలనీలు జలమయమయ్యాయి. అయితే చాలా రోజుల తర్వాత వర్షం కురియడంతో రైతులు సంతోషిస్తున్నారు. కొద్ది రోజులుగా వర్షాలు కురవక పోవడంతో వాడుముఖం పట్టిన కంది, పత్తిపంటలకు ఈ వర్షం జీవం పోసింది. పత్తి, కంది పంటలకు ఎరువులు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. సస్యరక్షణ చర్యల్లో రైతులు ఇక బిజీగా మారిపోనున్నారు. ఘట్‌కేసర్‌లో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం కురిసింది. నిత్యం ఎండలతో పాటు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న జనాలకు కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ప్రజల్లో సమానత్వాన్ని పెంపొందించాలి

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్/మర్పల్లి, సెప్టెంబరు 21 : సమాజ మార్పులో భాగంగా ప్రజల్లో సమానత్వాన్ని పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ ప్రతీక్ జైన్ అధ్యక్షతన నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల కేసులకు సంబంధించి సమీక్షించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ. నేర ప్రవృత్తి, వివక్షకు తావులేని సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అత్యాచార కేసులకు సంబంధించి పోలీసు అధికారుల సహకారం తీసుకుంటూ సమన్వయంతో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని డీవీఎంసీ సభ్యులకు సూచించారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావులేకుండా నిష్పక్షపాతంగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. బాధిత కుటుంబాలకు చెల్లించాల్సిన నష్టపరిహారాన్ని అతి తొందరలో ఇవ్వడం జరుగుతుందని హామీ ఇచ్చారు. జిల్లాలో కేసులను తగ్గించే దిశగా చర్యలుతీసుకోవాలని అదే విధంగా మూడు నెలలకోసారి తప్పని సరిగా డీవీఎంసీ సమావేశాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలపై దృష్టి సారించి పరిష్కార దిశగా పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, డీఎస్‌డీవో మల్లేశం, డీబీసీడీవో ఉపేందర్, డీటీడీవో కమలాకర్‌రెడ్డి, డీఎఫ్‌వో వెంకన్న, డీఎస్‌వో మోహన్ బాబు, అనంతయ్య, జగదీశ్, దస్తప్ప, కిరణ్‌రోనాల్డ్, సురేందర్‌లు పాల్గొన్నారు. కాగా అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు శేఖర్‌గుప్తా కుటుంబాన్ని స్పీకర్ ప్రసాద్‌కుమార్ పరామర్శించారు. శనివారం మర్పల్లిలోని నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శేఖర్‌గుప్తా మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని కొనియాడారు. అలాగే శేఖర్‌గుప్తా మృతి చెందడంతో రాజ్యసభ సభ్యుడు సంతోష్‌రావు, మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు కర్నెప్రభాకర్, శంబీపూర్ రాజు, బాలమల్లు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తదితరులు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.



నిత్యావసర ధరలకు రెక్కలు వచ్చాయి. అమాంతం పెరిగిన ధరలకు సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. కూరగాయలు, వంటనూనె, బియ్యం, ఉల్లి, అల్లం వెల్లుల్లి తదితరాల రేట్లు అందనంత ఎత్తులోకి చేరుకున్నాయి. ఇప్పటికే ఇంటి అద్దెలు, స్కూల్ ఫీజుల భారం మోయలేకపోతున్న మధ్యతరగతి ప్రజలు... నిత్యావసర ధరల పెరుగుదలతో ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదని ఆవేదన చెందుతున్నారు.

ధర దడ!

కొనలేం.. తినలేం..



నిత్యావసరాలు ధరలు భారీగా పెరిగాయి. ఇలాగే ఉంటే దసరా పండగ చేసుకోవడం కష్టమే. కూరగాయలు కొనే పరిస్థితి కనిపించడం లేదు. కిలో ఉల్లిగడ్డ 70 రూపాయలకు అమ్ముతున్నారు. ఇలాగైతే.. ఏం కొనలేం. ఏం తినలేం. ప్రభుత్వం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపులో ఉంచాలి. - బంగారు మాణమ్మ, తుమ్మలపల్లి, జిల్లేడు చౌదరిగూడ మండలం

రూ.500కు ఏం రావడం లేదు



వంద రూపాయలు తీసుకొని సంతకు వెళితే ఏం రావడం లేదు. పెరుగుతున్న ధరలను చూస్తే భయమేస్తుంది. ఇలాగే ఉంటే బతకడం కష్టం. ప్రభుత్వాలు నిత్యావసర ధరలు నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలి. ఉచితాల బదులు వీటిపై దృష్టి సారించాలి. - మాధవి, గృహిణి, పరిగి

- అమాంతం పెరిగిన కాయగూరల ధరలు
- దిగుమతి సుంకం పెంపుతో కాగుతున్న నూనెలు
- కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి
- ఘాటెక్కిన అల్లం వెల్లుల్లి, మార్కెట్‌లోకి కల్తీ పేస్టు

వంటింట.. కూరల మంట

(వికారాబాద్/మేడ్చల్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సెప్టెంబరు 21) : కూరగాయల ధరలు ఇటీవల విపరీతంగా పెరిగాయి. అన్ని రకాల కూరగాయలు అర్ధ సెంచరీ దాటేశాయి. చాలామంది కేజీ కూరగాయలు కొనేవారు అర కేజీ.. అరకేజీ కొనేవారు.. పావు కేజీతో సరిపెట్టుకుంటున్నారు. బీన్స్, క్యాప్సికమ్, బీన్స్, చామగడ్డ కేజీ 80 రూపాయలు అమ్ముతున్నారు. బహిరంగ మార్కెట్‌లో కాకర, గోకర, బెండ, దొండ, బీర, చిక్కుడు కాయ రూ.60 అమ్ముతున్నారు. 15 రోజుల క్రితం రూ.20 నుంచి 30 కిలో అమ్ముడుపోయిన టమాట ఇప్పుడు రూ.50కు చేరుకుంది. ఆలుగడ్డ, వంకాయ, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ రేట్లు రూ.50కి విక్రయిస్తున్నారు. ఈనెల మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు ఆకు కూరలు, కాయగూరలు దెబ్బతిన్నాయి. దీంతో వీటి రేట్లు అమాంతం పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. పాలకూర, తోట కూర, గోంగూర, పొనగంటి కూర, బచ్చల కూర, మెంతి కూర ధరలు భారీగా పెరిగాయి. కొత్తిమీర ధర పైపైకి ఎగబాకింది. ఒక కట్టకి 40 రూపాయలు తీసుకుంటున్నారు. దసరా సమీపిస్తున్న నేపథ్యంలో. ధరలు ఇలా ఉంటే.. ఈసారి పండగ చేసు కోవడమెలా అని మధ్యతరగతి కుటుంబాలు వాపోతున్నాయి.

సలసల కాగుతున్న నూనెలు

వంట నూనె ధరలు సలసల కాగుతున్నాయి. ఉన్నట్టుండి కిలోపై రూ.20 పెరిగింది. ఎక్కువ మంది ఉపయోగించే పామాయిల్, పొద్దు తిరుగుడు నూనె ధరలు భగ్గుమంటున్నాయి. విదేశీ దిగుమతులపై సుంకాన్ని కేంద్రం పెంచడంతో నూనె ధరలు పెరిగాయి. వంట నూనె ధర పెరగడంతో కల్తీనూనె రంగప్రవేశం చేసే అవకాశముంది.

కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి

ఉల్లి ధర కన్నీరు తెప్పిస్తుంది. ఇప్పటికే కిలో ఉల్లి ధర 70 రూపాయలు పలుకుతుంది. నవంబర్ నెలలో ఉల్లి రేటు కిలోకు రూ.100 నుంచి 120కి పెరిగే అవకాశముందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మార్కెట్‌లో ఉల్లి కొరత, డిమాండ్ పెరగడం.. కొత్త పంట మార్కెట్‌లోకి ఇంకా రాకపోవడంతో ధరలు భారీగా పెరుగుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

ధరల పెంపుతో వినియోగదారుల ఆగ్రహం

వంట నూనెల ధరల పెంపుతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిల్వ ఉన్న సరుకును కూడా ఎక్కువ ధరకు విక్రయించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రేట్ హోల్‌సేల్‌గా లీటరు రూ.110 అమ్ముతుండగా చిల్లరగా రూ.125 చొప్పున విక్రయిస్తున్నారు. పొద్దు తిరుగుడు నూనె కొన్ని స్థానిక దుకాణాల్లో లీటరు రూ.140 చొప్పున అమ్ముతున్నారు. పూజలకు విక్రయించే వివిధ రకాల నూనెలు లీటరు ధర మొన్నటి వరకు రూ. 109 వరకు ఉండగా ఇవి ఇప్పుడు రూ.120కి చేరాయి.

ఘాటెక్కిన అల్లం వెల్లుల్లి

అల్లం, వెల్లుల్లి సామాన్యులు కొనలేని పరిస్థితి ఉంది. కిలో వెల్లుల్లి ధర రూ.320, అల్లం రూ.200కు అమ్ముతున్నారు. సిటీకి ఎక్కువగా కేరళ, కర్ణాటక, తెలంగాణలోని జహీరాబాద్, కోహిర్ నుంచి అల్లం వెల్లుల్లి దిగుమతి చేసుకుంటున్నారు. దిగుమతులు తగ్గడంతో ధర పెరిగినట్లు తెలుస్తుంది. రేటు పెరగడంతో కొందరు అక్రమార్కులు కల్తీ పేస్టు తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. తక్కువ ధరకే అల్లం, వెల్లుల్లి పేస్టు అంటూ నమ్మిస్తున్నారు. గల్లీలోని కిరాణా షాపుల్లో తయారిదారుల పేరు, తేదీలు లేని అల్లం వెల్లుల్లి పేస్టు డబ్బాలు అమ్ముతున్నారు. తక్కువ ధరకు దొరికే కల్తీ పేస్టు కొనుగోలు చేస్తే అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముందని డాక్టర్లు చెబుతున్నారు.

కూరగాయల ధరలు(కిలో రూ.లలో)

అల్లం : 200	కీర : 50
వెల్లుల్లి : 320	వంకాయ : 50
బీన్స్ : 80	నిమ్మకాయలు : రూ. 20కి మూడు
క్యాప్సికమ్ : 80	కొత్తిమీర కట్ట : రూ.40 (ఒకటి)
చామగడ్డ : 80	తోటకూర, పాలకూర, పూదీన, గోంగూర, పొనగంటి కూర, మెంతి కూర : రూ.10 (చిన్నసైజు కట్టకు)
ఉల్లిగడ్డ : 70	
బెండ : 60	
దొండ : 60	
చిక్కుడు : 60	
బీర : 60	
పచ్చి మిర్చి : 60	
గోకర : 60	
కాకర : 60	
క్యారెట్ : 60	
ఆలుగడ్డ : 50	
టమాట : 50	



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

ప్రమాదాల నివారణపై దృష్టిపెట్టాలి

- సమీక్షలో ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, సెప్టెంబరు 21 : జిల్లా పోలీసు అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టిపెట్టాలని, ఈమేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. నమోదైన కేసులపై తెలుసుకుని మాట్లాడారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి డీఎస్పీ, సీఐలు కృషి చేయాలన్నారు. యాక్సిడెంట్లు, ఆత్మహత్యల నివారణకు సీసీటీవీలు, వాహనాల తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్‌లు, మట్కా, జూదం నివారణకు ఎన్ఫోర్స్‌మెంట్ వర్క్ పెంచాలన్నారు. పాత నేరస్తులు, రౌడీ షీటర్లపై దృష్టి పెట్టి వారికి ఎప్పటికప్పుడు కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. గ్రేవ్ కేసుల్లో నిందితులకు శిక్షపడేలా అధికారులు విచారణ చేయాలన్నారు. డయల్ 100ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి

- జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి



మాట్లాడుతున్న కృష్ణవేణి

వికారాబాద్, సెప్టెంబరు 21 : పిల్లల్లో పోషకాహార లోప నివారణకు వారికి నిత్యం పౌష్టికాహారాన్ని అందించాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి తెలిపారు. శనివారం పిల్లల పోషణ అంశంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. సప్లిమెంటరీ సూపర్‌వైజరీ ఫీడింగ్ ప్రోగ్రామ్ ద్వారా పిల్లల్లో పోషకస్థితిని పరీక్షించాలన్నారు. అంగన్‌వాడీల్లో బాలామృతం ప్లస్ వంటి పౌష్టికాహారం అందిస్తారని తెలిపారు. ఎత్తు, బరువు తక్కువ వారిని ఎన్ఆర్సీ సెంటర్‌కు రెఫర్ చేస్తామని వివరించారు. కార్యక్రమంలో ట్రైనర్లు నరసింహారావు, ప్రశాంతి, కాంతారావు, ప్రవీణ, జహీరుద్దీన్, రాములు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడి సేవలో డీఎంహెచ్‌వో

కీసర, సెప్టెంబరు 21: కీసరగుట్ట రామలింగేశ్వరస్వామిని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రఘునాథస్వామి శనివారం దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయనతో ఆలయ చైర్మన్ నాగలింగంశర్మ, ఈవో సుధాకర్, అర్చకులు ఉన్నారు.




స్వామివారి పూజలో రఘునాథస్వామి

విలీన గ్రామాల్లో.. నిలిచిన రిజిస్ట్రేషన్లు

- ఐదు రోజులుగా ఇదే పరిస్థితి
- పోర్టల్‌ను అప్‌డేట్ చేయని ఐటీ శాఖ
- సర్వర్ డౌన్ అంటున్న సబ్-రిజిస్ట్రార్లు

మేడ్చల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మునిసిపాలిటీల్లో విలీనమైన గ్రామాలకు చెందిన ఆస్తుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. డీడీలు చెల్లించి, స్లాట్లు బుక్ చేసుకున్న కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్ల కోసం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ.. రిక్తహస్తాలతో వెనక్కి మళ్లుతున్నారు. ముఖ్యంగా హెచ్‌ఎండీఏ లేఅవుట్లు అధికంగా ఉన్న గ్రామాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. జిల్లాలో 28 గ్రామాలను సమీప మునిసిపాలిటీల్లో విలీనం చేసిన విషయం తెలిసిందే.! ఈ మేరకు ఐటీ శాఖ పరిపాలన పరమైన అన్ని శాఖల వెబ్‌సైట్లను అప్‌డేట్ చేస్తుంది. అయితే.. రాష్ట్ర ఖజానాకు కీలక ఆదాయ వనరుల్లో ఒకటైన రిజిస్ట్రేషన్ల శాఖ విషయంలో మెతకవైఖరి అవలంబిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సబ్-రిజిస్ట్రార్లకు స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడంతో.. కొన్ని వందల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా.. విలీన గ్రామాల వివరాలను రిజిస్ట్రేషన్ల శాఖ పోర్టల్‌లో అప్‌డేట్ చేయలేదని సమాచారం. డీడీల చెల్లింపు, స్లాట్ బుకింగ్ ప్రక్రియలు యథావిధిగా సాగుతున్నా.. రిజిస్ట్రేషన్ విషయంలో 'సర్వర్ ఎర్రర్'గా చూపుతోందని సబ్-రిజిస్ట్రార్లు చెబుతున్నారు. పోర్టల్‌లో మార్పులు చేయాల్సి ఉన్నందునే.. రిజిస్ట్రేషన్లను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఉన్నతాధికారులు వివరిస్తున్నారు. ఐదు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొందని జిల్లా రిజిస్ట్రార్ చెబుతున్నారు.





దిక్కుతోచని స్థితిలో రియల్టర్లు

విలీన గ్రామాలు రింగ్‌రోడ్డు పరిసరాల్లో ఉన్నందున ఈ గ్రామాల్లో పెద్ద ఎత్తున హెచ్‌ఎండీఏ వెంచర్లు ఉన్నాయి. ఈ వెంచర్లకు సంబంధించి.. కొనుగోలుదారులకు ఇచ్చిన హామీ ప్రకారం ప్లాట్ల రిజిస్ట్రేషన్లు కాకపోవటంతో రియల్టర్లు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఘట్‌కేసర్, కీసర, శామీర్‌పేట, మేడ్చల్ ఎస్ఆర్‌వో పరిధిలో ఐదు రోజులుగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో.. రియల్టర్లు తలలు పట్టుకుంటున్నారు. కనీసం రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఎప్పుడు పునరుద్ధరిస్తారనేదానిపై సబ్-రిజిస్ట్రార్ల వద్ద కూడా సమాచారం లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు.

అర్హులైన ప్రతీ రైతుకు రూ.2లక్షల రుణమాఫీ



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు, సెప్టెంబరు 21: కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతీ రైతుకు రూ.2లక్షల రుణమాఫీ వర్తింపజేస్తుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పూడూరు రైతువేదికలో ఎమ్మెల్యే మండల సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వ్యవసాయ, బ్యాంక్ అధికారులు రుణమాఫీ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టారన్నారు. ఇప్పటికే చాలామందికి రుణమాఫీ అయిందని, సాంకేతిక కారణాలతో మాఫీ కానివారిని కూడా త్వరలోనే ప్రభుత్వం రుణవిముక్తులను చేస్తుందని, ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని అన్నారు. అధికారులు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్నారని, ఎవరూ ఆందోళన చెందొద్దని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, ప్యాక్స్ చైర్మన్ సతీష్‌రెడ్డి, నాయకులు రఘునాథ్‌రెడ్డి, పెంటయ్య, అజీంపటేల్, శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దేవునిఎర్రవల్లిలో నేడు ఉచిత వైద్యశిబిరం


చేవెళ్ల, సెప్టెంబరు 21 : నేడు(ఆదివారం) దేవునిఎర్రవల్లి గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విమలా కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించడం జరుగుతుందని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకవాలని కోరారు.













చెరువు శిఖం భూమి సర్వే



ఎర్రం చెరువు శిఖం నక్ష మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

చౌదరిగూడ, సెప్టెంబరు 21: జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని జిల్లేడ్ గ్రామ శివారు సర్వేనంబర్ 145లో ఉన్న ఎర్రం చెరువు శిఖం భూమిని శనివారం ఇరిగేషన్ ఏఈ సింధు, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, సర్వేయర్ ఆంజనేయలుతో కలిసి పరిశీలించారు. ఈమేరకు చెరువు భూమిని సర్వే చేసి నక్ష ప్రకారం హద్దులను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



సమీక్ష నిర్వహిస్తున్న న్యాయమూర్తి రాజ్యలక్ష్మి

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 21: ఈ నెల 28న నిర్వహించే లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకొని ప్రశాంతమైన జీవితం గడపాలని షాద్‌నగర్ న్యాయ సేవాసాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని పోలీస్ అధికారులతో కోర్టు ప్రాంగణంలో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లడుతూ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా పోలీసులు చొరవ తీసుకోవాలన్నారు. కోర్టుల చుట్టూ తిరగడం వల్ల సమయం వృథా చేసుకోవద్దని తెలిపారు. సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి సూరజ్ కుమార్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ధీరజ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్, అన్ని మండలాల ఎస్సైలు పాల్గొన్నారు.

గ్యాస్ లబ్ధిదారులు తప్పులు సరిచేసుకోవాలి



లింగ్యానాయక్, జిల్లా అదనపు కలెక్టర్

వికారాబాద్, సెప్టెంబరు 21:రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రూ.500కు సబ్సిడీ గ్యాస్ పథకంలో లబ్ధిదారు వారి పేర్లు, గ్యాస్ కనెక్షన్ నంబర్లు సరి చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. ఎల్పీజీ వినియోగదారుల వివరాల్లో తప్పులుంటే సవరించాలని ఎల్పీజీ గ్యాస్ ఏజెన్సీలను ఆదేశించారు. వినియోగదారుల పేర్లు, ఆధార్, గ్యాస్ కనెక్షన్ల నబంర్లలో తప్పులుంటే గ్యాస్ ఏజెన్సీల వద్ద ఈ-కేవైసీ చేయించుకొని ప్రజాపాలనసేవ కేంద్రంలో ఎంపీడీవోలకు అందజేయాలని సూచించారు.

బిల్లులు రాలేదని పాడిరైతుల నిరసన



దోమ, సెప్టెంబరు 21: మూడు నెలలుగా బిల్లులు రావడం లేదని గుండాల్‌కు చెందిన విజయ డెయిరీ పాడి రైతులు శనివారం డెయిరీ వద్ద నిరసన తెలిపారు. బిల్లులు రాక తాము ఇబ్బందులకు గురవుతున్నామని అన్నారు. అధికారులు వెంటనే స్పందించి తమ పాల బిల్లులను చెల్లించాలని కోరారు.

అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీవో వాసుచంద్ర

నవాబుపేట, సెప్టెంబరు 21 : మండలంలోని గేటువనంపల్లి రైల్వే గేటు వద్ద అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణానికి శనివారం ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ జయరాం, రైల్వే ఈఈ రాజీవ్‌రంజన్ స్థలాన్ని పరిశీలించారు. అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం విషయంలో సమీప భూ యజమానులకు ఏమైనా అభ్యంతాలుంటే తెలియజేయాలని కోరారు. త్వరలోనే బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలుపెడతామన్నారు.





అత్యంత విశ్వసనీయ కంపెనీల్లో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్

శంషాబాద్ రూరల్: జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ (గతంలో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రా లిమిటెడ్)కు ప్రపంచంలోని అత్యంత విశ్వసనీయ కంపెనీల్లో చోటు లభించింది. ట్రాన్స్‌పోర్ట్, లాజిస్టిక్స్, ప్యాకేజింగ్ విభాగంలో అగ్రశ్రేణి విమానాశ్రయ కంపెనీగా న్యూస్‌వీక్ వరల్డ్ మోస్ట్ ట్రస్ట్ కంపెనీలస్ సర్వే-2024లో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ అంతర్జాతీయంగా ఐదో స్థానాన్ని దక్కించుకుంది. గ్లోబల్ డేటా, బిజినెస్ ఇంటలిజెన్స్ ప్లాట్‌ఫామ్ స్టాటిస్టాతో కలిసి న్యూస్‌వీక్ ఈ సర్వేను రూపొందించింది. 23 పరిశ్రమలు, 20కి పైగా దేశాల్లోని 1,000 కంపెనీలను పరిశీలించి ఈ అవార్డును ప్రకటించారు.

పాఠశాలను నిర్మించడం అభినందనీయం



దేవరయంజాల్‌లో పాఠశాల నూతన భవవం వద్ద దాత రాజన్న, డీఈవో, విద్యార్థులు, సిబ్బంది

శామీర్‌పేట, సెప్టెంబరు 21 : విద్యార్థులకు ఉపయోగపడేలా పాఠశాల భవనాన్ని దాతలు నిర్మించడం అభినందనీయమని డీఈవో విజయ కుమారి అన్నారు. తుముకుంట మున్సిపల్ పరిధి దేవరయంజాల్‌లో పాత పాఠశాలను కూల్చి కొత్తగా నిర్మించేందుకు టాటా సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ అధ్యక్షుడు రాజన్న ముందుకొచ్చి స్కూలును కట్టించారు. ఆధునాతన హంగులతో నిర్మించిన పాఠశాలను శనివారం డీఈవో విజయకుమారి, దాత రాజన్న, హెచ్‌ఆర్ సునిల్, ఎంఈవో వసంతకుమారిలు ప్రారంభించారు. కార్యక్రమంలో దాత రాజన్నను డీఈవో, టీచర్లు. స్థానికలు ఘనంగా సన్మానించారు.

నాగారంలో జగన్ దిష్టిబొమ్మ దహనం



జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

కీసర, సెప్టెంబరు 21: తెలుగుదేశం పార్టీ అధ్వర్యంలో శనివారం ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో జంతు అవశేషాలను కలపడం దారుణం అన్నారు. కల్తీ నెయ్యితో లడ్డూచేసి దేవుడికి నైవేద్యం, భక్తులకు ప్రసాదం ఇవ్వడం మహాపాపం అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి అపచారానికి ఒడిగట్టిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, అప్పటి ఈవో ధర్మారెడ్డిలపై చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జంగారెడ్డి, ఉమాశంకర్‌గౌడ్, రంగారావు, కోటేశ్వర్‌రావు, బ్రహ్మంచౌదరి, వెంకటిరెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



బీజేపీ సభ్యత్వ నమోదులో మాట్లాడుతున్న ఎంపీ రాజేందర్

కీసర, సెప్టెంబరు 21: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం నాగారంలో బీజేపీ సభ్యత్వ నమోదుకు ఎంపీ ముఖ్య అతిథిగా వచ్చి ప్రారంభించారు. ఈటల మాట్లాడుతూ.. నరేంద్రమోదీపై గౌరవంతో ప్రజలు బీజేపీ సభ్యత్వాలు తీసుకుంటున్నారని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలన్నారు. కష్టపడి పని చేసేవారికి అవకాశాలు వస్తాయన్నారు. ఏ సమస్యొచ్చినా తన వద్దకు రావొచ్చని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రూరల్ అధ్యక్షుడు పి.విక్రమ్ రెడ్డి, నాగారం మున్సిపల్ చైర్మన్ కె.చంద్రారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధారూరు ఏఎంసీ చైర్మన్‌గా విజయబాస్కర్‌రెడ్డి



కె.విజయభాస్కర్‌రెడ్డి, ఎల్.అశోక్

ధారూరు, సెప్టెంబరు 21: ధారూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కెరెల్లికి చెందిన కె.విజయ భాస్కర్ రెడ్డి, వైస్‌చైర్మన్‌గా ధారూరుకు చెందిన ఎల్.అశోక్‌కు ప్రభుత్వం నియమించింది. డైరెక్టర్లుగా బాబునాయక్, షమీమ్ పాషా, అంజయ్య, వాణిశ్రీ, ప్రతాప్, జైపాల్, శోభ, రవీందర్, రమేశ్, సాయన్న, అమరేశ్వరావు, రవీందర్‌రెడ్డి నియామకమయ్యారు. వీరు రెండేళ్ల పదవుల్లో ఉంటారు.

భూ రికార్డులు సక్రమంగా ఉంచాలి



రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

పెద్దేముల్, సెప్టెంబరు 21: రైతుల భూ రికార్డులను సక్రమంగా ఉంచాలని సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ అన్నారు. పెద్దేముల్ తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆయన తనిఖీచేసి చేశారు. ఏ రికార్డులు ఎలా భద్రపరుస్తున్నారనే విషయాలపై ఆరా తీశారు. రికార్డులు చిందరవందరగా పెట్టొద్దని, సక్రమంగా పెట్టాలని సూచించారు. రైతులు ఎలాంటి సమస్యలపై వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న షీ టీమ్ పరిగి ఇన్‌చార్జి నర్సిములు

దోమ, సెప్టెంబరు 21: మండలంలోని దిర్సంపల్లి ఉన్నత పాఠశాలలో సబ్ డివిజన్ షీ టీమ్ ఇన్‌చార్జి నర్సిములు సమక్షంలో విద్యార్థులకు సైబర్ నేరాలు, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. డయల్ 100, మహిళలపై జరుగుతున్న నేరాలు, సీసీ కెమెరాలు, బాల కార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మద్యపాన నిషేధం, ఆన్‌లైన్ మోసాలు తదితర అంశాలపై వివరించారు. విద్యార్థులు చెడు అలవాట్లు చేసుకోవద్దని, చదువుపైనే దృష్టి సారించాలని సూచించారు. హెచ్‌ఎం వెంకటయ్య, టీచర్ రాజు, షీ టీమ్ సభ్యులు మనీషా, శోభారాణి పాల్గొన్నారు.

జంతు జనన నియంత్రణకు చర్యలు



పరిగిలో జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి సదానందం

పరిగి/కొడంగల్, సెప్టెంబరు 21: జిల్లాలో జంతు జనన నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా పశువైద్యాధికారి సదానందం తెలిపారు. శనివారం పరిగిలో జననియంత్రణ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో రెండు, మూడు రోజుల్లో జననియంత్రణ కేంద్రాలు పనిచేస్తాయని తెలిపారు. ముఖ్యంగా కుక్కల్లో సంతానోత్పత్తి నివారణకు కుక్కలకు ఆపరేషన్లు చేస్తామన్నారు. కుక్కల బెడదను నివారించేందుకు ఈ డ్రైవ్‌ను చేపట్టామన్నారు. వీధుల్లో తిరిగే కుక్కలను జనన నియంత్రణ కేంద్రానికి పట్టుకొచ్చి ఆడ, మగ కుక్కలకు సంతానం కాకుండా శస్త్రచికిత్సలు చేస్తామని తెలిపారు. చికిత్స తర్వాత మూడు నుంచి ఐదు రోజులు వాటిని పరిశీలినలో ఉంచి వదుల్తామన్నారు. అలాగే కుక్కలకు రేబీస్ టీకాలు కూడా వేస్తామన్నారు. కుక్కలు పెంచుకుంటున్న వారు కూడా ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఇకపై కుక్కల గురించి భయం వొద్దన్నారు. సంతతి నియంత్రణ, ఒకవేళ అవి కరిచినా మనుషులకు, పశువుకు ఏమీ కాకుండా అవసమైన చర్యలన్నీ తీసుకుంటామని తెలిపారు. పశుసంవర్థక శాఖ సిబ్బందే కుక్కలను పట్టుకొచ్చి ఆపరేషన్లు చేస్తారని వెల్లడించారు. పెంపుడు కుక్కలకు కూడా ఈ ఆపరేషన్లు చేయించుకోవ్చన్నారు. కార్యక్రమంలో మునిపినల్ కమిషనర్ వెంకటయ్య, అధికారులు సతీష్; వినోద్ తదితరులు ఉన్నారు. కొడంగల్‌లోని పశువైద్యశాలలో జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని పశువైద్యాధికారి నోహ తెలిపారు. కుక్కల సంతానోత్పత్తిని అరికట్టేందుకు శస్త్రచికిత్సలు చేస్తామన్నారు. ఇక్కడ త్వరలోనే కుక్కలకు శస్త్రచికిత్సలు చేస్తామని తెలిపారు.

ఉద్యానవన పంటలకు ప్రోత్సాహకం

- ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం రాయితీ
- బీసీలకు 90, ఇతరులకు 80 శాతం రాయితీపై డ్రిప్పు, స్ప్రింకర్లు
- చిన్న సన్నకారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు, దివ్యాంగులకు ప్రాధాన్యం
- 18 మండలాల్లో 96 మందికి చెందిన 300 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు శ్రీకారం



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్): ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వంద శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని సమకూర్చాలని నిర్ణయించింది. ఉద్యాన, పట్టు పరిశ్రమ పంటల సాగుకు ప్రభుత్వం సూక్ష్మ సేద్య పరికరాలను అందించనుంది. షెడ్యూల్ కులం/తెగల రైతులకు 100 శాతం రాయితీ కల్పిస్తుంది. అలాగే వెనుకబడిన తరగతుల రైతులకు 90 శాతం, ఇతరులకు 80 శాతం రాయితీ కల్పించనున్నారు. గరిష్ఠంగా 5 హెక్టార్ల వరకు డ్రిప్పు, స్ప్రింకర్లపై 75 శాతం రాయితీ(హెక్టారుకు) కల్పిస్తారు. చిన్న, సన్నకారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు, దివ్యాంగులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. రంగారెడ్డి జిల్లాకు సూక్ష్మసేద్య పరికరాలకు 704 ఎకరాలు, స్ప్రింక్లర్లకు 432 ఎకరాల లక్ష్యాన్ని నిర్ణయించారు. గతంలో మీసేవ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు, రైతు వాటా చెల్లించిన తేదీకి అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో డ్రిప్, స్ప్రింక్లర్లను అందించనున్నారు. ఆసక్తిగల రైతులు ఉద్యానశాఖ అధికారిని సంప్రదించాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి కె. సురేష్ తెలిపారు.

ఆయిల్ సాగుపై 25న మెగా ప్లాంటేషన్..

జిల్లాలో ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. జిల్లాలో 3 వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు చేయాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు జిల్లాలో 1310 ఎకరాలకు పరిపాలన మంజూరు ఇవ్వగా.. 854 ఎకరాలు సాగు చేస్తున్నారు. నేలలు, వాతావరణ అనుకూల దృష్ట్యా దీర్ఘకాల పంట అయిన ఆయిల్ పామ్ సాగు త్రికోణ, చతురస్రాకార పద్ధతిలో చేపడుతున్నారు. త్రికోణ పద్ధతిలో ఎకరానికి 57, చతురస్రాకార పద్ధతిలో 50 మొక్కలు నాటుకునేందుకు అనువుగా ఉంటుంది. సాగు విస్తీర్ణతను పెంచే లక్ష్యంగా రాయితీపోను మొక్కకు రూ.20 చొప్పున రైతు వాటాగా చెల్లించాలి. ఔత్సాహిక రైతులు ప్రాంతీయ ఉద్యాన అధికారి, అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ అధికారి, ఫీల్డ్ ఆఫీసర్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 25న మెగా ప్లాంటేషన్ ద్వారా 300 ఎకరాల్లో 18 మండలాల్లో 96 మంది రైతు పొలాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టనున్నారు.

రైతులు సంప్రదించాల్సిన అధికారులు..

ఇబ్రహీంపట్నం, యాచారం, బాలాపూర్, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, మంచాల మండలాలకు చెందిన రైతులు ఉద్యానశాఖ అధికారి నవీన (8977714219) ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలి. చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, షాబాద్, శేరిలింగంపల్లి, గండిపేట మండలాలకు సంబంధించి కీర్తికృష్ణ (8977714222), ఆమనగల్, కడ్తాల్, తలకొండపల్లి, మహేశ్వరం, కందుకూరు, శంషాబాద్, రాజేంద్రనగర్ రైతులు సౌమ్య (8977714221), షాద్‌నగర్, కేశంపేట, కొత్తూరు, నందిగామ, చౌదరిగూడెం, కొందుర్గు మండలాలకు చెందిన రైతులు ఉద్యానశాఖ అధికారి హిమబిందు (8977714220)ను సంప్రదించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి తెలిపారు.

బోగస్ ఓటర్లను తొలగించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కేశంపేట, సెప్టెంబరు 21: మండల పరిధిలో ఉన్న బోగస్ ఓటర్లను తొలగించాలని కేశంపేట బీజేపీ శాఖ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ మీర్ ఆజంఅలీకి వినతి పత్రం అందించారు. మండలంలోని అల్వాల, కొత్తపేట, సంతాపూర్, పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి, తొమ్మిదిరేకుల, కాకునూర్, లేమామిడి, కొనాయపల్లి, నిర్ధవెల్లిలో అధికంగా బోగస్ ఓట్లు నమోదవుతున్నట్లు తెలిపారు. గతంలో గ్రామాలను వదిలి హైదరాబాద్‌లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నవారు, ఇటీవల గ్రామానికి వచ్చి నూతనంగా ఓటు నమోదు చేసుకుంటున్నారని వివరించారు. గ్రామాల్లో ఇల్లు లేకపోయినా ఇతరుల ఇంటి నెంబర్లపై ఓటు నమోదు చేసుకుంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. పాండు రంగా రెడ్డి, ఉడుత హరికృష్ణ తదితరులున్నారు.

ఎంఎస్ఎంఈ-2024 పాలసీలో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎన్పీఆర్డీ నాయకులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 21: తెలంగాణ ఎంఎస్ఎంఈ-2024 పాలసీలో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్పీఆర్డీ) ఆదర్వంలో శనివారం కలెక్టర్ శశాంకను కలిసి వినతిపత్రమందజేశారు. పాలసీలో సవరణ చేసి 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి, ప్రధాన కార్యదర్శి జెర్కోని రాజు డిమాండ్ చేశారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని నిర్దేశించినా అమలు చేయకపోవడం ఆందోళన కలిగిస్తోందని వారన్నారు.

పావలా వడ్డీకే రుణాలివ్వాలి



సమావేశంలో పాల్గొన్న మణెమ్మ, జి.కవిత

కందుకూరు, సెప్టెంబరు 21: డ్వాక్రా సంఘాల సభ్యులకు ప్రభుత్వం పావలాకే రుణాలు మంజూరు చేసినట్లు స్నేహ మహిళ మ్యాక్స్‌కు వర్తింపజేయాలని ఆ సంఘం మండలాధ్యక్షురాలు చల్లా మణెమ్మ, కార్యదర్శి గంగాపురం కవితలు కోరారు. శనివారం మండల కేంద్రంలో జ్యోతి ప్రజ్వల చేసి ఆ సంఘం సర్వసభ్య సమావేశాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ 2014 నుంచి స్నేహ మహిళ మ్యాక్స్‌కు పావలా వడ్డీకి రుణాలు ఇవ్వడం లేదన్నారు. రుణాలు తీసుకున్న మహిళలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 2023-24 సంవత్సరానికి గాను స్నేహ మహిళ మ్యాక్స్ ద్వారా రూ.3కోట్ల రుణాలను అందించడం జరిగిందన్నారు. దీనికి గాను సంఘానికి రూ.20లక్షల లాభం వచ్చినట్లు గుర్తు చేశారు. 15మంది సభ్యులు, డ్వాక్రా సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్ష ఎంతో పవిత్రమైనది



మహా పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న రంగరాజన్

మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 21: కార్తీకమాసంలో చేపట్టే అయ్యప్ప దీక్ష ఎంతో పవిత్రమైనదని చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ తెలిపారు. చిలుకూరు గ్రామానికి చెందిన విజయ భార్గవరెడ్డి, కుమ్మరి శివశంకర్‌ల ఆధ్వర్యంలో శబరిమలకు వచ్చే నెల 18న చిలుకూరు బాలాజీ ఆలయం నుంచి శ్రీ హనుమధ్వజ శబరిమల మహా పాదయాత్రకు దాదాపు 20 మంది స్వాములు వెళ్లనున్నారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను రంగరాజన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. శివాలయం ప్రధాన అర్చకులు సురేష్ పంతులు, భక్తులు ఉన్నారు.

దైవ సన్నిధిలో అక్రమాలా?

పవిత్రమైన లడ్డూను అపవిత్రం చేస్తారా? : ఎమ్మెల్యే శంకర్

టీటీడీ మాజీ బోర్డు మెంబర్ బక్కని నర్సింహులు



ఎమ్మెల్యే శంకర్, బక్కని నర్సింహులు

షాద్‌నగర్, సెప్టెంబరు 21: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూను అపవిత్రం చేయడంపై షాద్‌నగర్ వీర్లపల్లి శంకర్, టీటీడీ బోర్డు మాజీ మెంబర్ బక్కని నర్సింహులు మండిపడ్డారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రసాదాన్నే అపవిత్రం చేశారంటే.. ఇక దేశం ఏ విధంగా బాగుపడుతుందని ఎమ్మెల్యే శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిపాలతో సమానంగా చూసే తిరుపతి లడ్డూను భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా తయారు చేయడం బాధకరమన్నారు. దైవ సన్నిధిలో అక్రమాలకు పాల్పడటం క్షమించరాని నేరమని పేర్కొన్నారు. అక్రమాలకు కారకులైన వారిపై ఏపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. టీటీడీ మాజీ బోర్డు సభ్యులు బక్కని నర్సింహులు మాట్లాడుతూ ఏపీ మాజీ సీఎం హయాంలోనే తిరుమల తిరుపతి దేవస్థానాన్ని అపవిత్రం చేశారని విమర్శించారు. అక్కడ అన్యమత ప్రచారాలు చేయడం, హిందువుల ఆలయాలను కూల్చడం వంటి దుశ్చర్యలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. శ్రీవారి లడ్డూ అపవిత్రం కావడానికి గల కారకులను కఠినంగా శిక్షించాలని కోరారు.



టీజీవో నూతన కార్యవర్గం

ఉద్యోగ సంఘాలను అణగదొక్కిన బీఆర్ఎస్ సర్కార్

మేడ్చల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఉద్యోగ సంఘాలపై ఉక్కుపాదం మోపి నిర్వీర్యం చేసే యత్నం చేసిందని రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ అన్నారు. శనివారం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీ ఎన్నికను తూంకుంట మొగుళ్ల వెంకటరామిరెడ్డి గార్డెన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథి శ్రీనివాస్ మాట్లాడుతూ... టీజీవో అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేసేలా కృషిచేస్తున్నామన్నారు. ఉద్యోగుల సమస్యలపై పోరాడకుండా గత ప్రభుత్వం సంఘాలపై కుట్ర పన్నిందని ఆరోపించారు. గతంలో చేయని పనులను ప్రస్తుత ప్రభుత్వంతో చేయించుకునేలా కార్యాచర రూపొందిస్తున్నామన్నారు. జిల్లా స్థాయిలో సమస్యలుంటే కలెక్టర్ల దృష్టికి తీసుకుపోయి పరిష్కరించుకోవాలని సూచించారు. ఉద్యోగులకు చెందాల్సిన డీఏలను త్వరలో సాధించి తీరుతామన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి, మాజీ ట్రెజరర్ ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా నూతన కమిటీ

జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా బి.వినోద్‌ను, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కురుమూర్తిలను ఎన్నుకున్నారు. కమిటీలో 19 మందిని ఎంపిక చేశారు.


రాష్ట్రంలో అత్యుత్తమ క్రీడా పాలసీ అమలుకు చర్యలు



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

కడ్తాల్, సెప్టెంబరు 21: క్రీడా రంగంలో తెలంగాణను దేశంలో అగ్రభాగాన నిలుపాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయమని, అందుకు ప్రభుత్వం అత్యుత్తమ క్రీడా పాలసీని రూపొందించి అమలుకు చర్యలు తీసుకుంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ 68వ క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంఈవో బాసు నాయక్ అధ్యక్షతన, ఎంఎన్‌వో జంగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మండల పరిధిలోని 14 ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలకు చెందిన 400 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. పరేడ్, గౌరవందనం, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పీడీలు బీముడు, మహమూద్, వెంకటేశ్, ఉపాధ్యాయులు రాధాకృష్ణరెడ్డి, మల్లయ్య, శోభరాణి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, పీఎసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నాయకులు హన్మనాయక్, గూడూరు భాస్కర్‌రెడ్డి, జహంగీర్‌అలీ, లక్ష్మణ్, శేఖర్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, ఇమ్రాన్‌బాబా, శ్రీశైలం, శంకర్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన చిలుక మధుసూదన్‌రెడ్డి



శ్రీధర్‌బాబుకు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న మధుసూదన్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్/ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 21 : గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్(పండ్లు) పదవి వరించిన చిలుక మధుసూదన్‌రెడ్డి శనివారం మంత్రులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబును కలిశారు. బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఆయనతో పాటు వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కరచారి, డైరెక్టర్లు జైపాల్‌రెడ్డి, అంజయ్య, మేకం నర్సింహ, బండి మధుసూదన్‌రావు, నవరాజ్, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌గుప్తా, ఇబ్రహీం తుర్కయాంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ తదితరులు తదితరులు ఉన్నారు.

గౌడ కులస్థుల ఆర్థికాభివృద్ధికి సహకరించాలి



మంత్రి జూపల్లితో గౌడ సంఘం నాయకులు

మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 21: రంగారెడ్డి జిల్లాలోని ప్రతీ గ్రామంలో గౌడ కులస్థుల ఆర్థికాభివృద్ధికి ఈత చెట్లను నాటుకునేందుకు ఐదెకరాల ప్రభుత్వ స్థలం కేటాయించాలని గౌడ సంఘం జిల్లా సీనియర్ నాయకుడు బాకారం ఎల్గని వెంకటేష్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మొయినాబాద్ మండల గౌడ సంఘం సభ్యులతో కలిసి శనివారం నగరంలో అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ గీతన్నలకు ద్విచక్ర వాహనాలను అందించాలని కోరారు. కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వెంకటేష్ గౌడ్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మండలాధ్యక్షుడు అంజయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎల్గని నవీన్ గౌడ్, వివిధ గ్రామాలకు చెందిన గౌడ సంఘం నాయకులు ఉన్నారు.

ధారూరులో పెసర, మినుము బీట్లు

ధారూరు, సెప్టెంబరు 21: ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం పెసర, మినుము పంటల బీట్లు నిర్వహించారు. పెసర క్వింటాలుకు గరిష్టంగా రూ.8,300, కనిష్టంగా రూ.7000, మినుములు క్వింటాలుకు గరిష్టంగా రూ.4600, కనిష్టంగా రూ.3,500 ధర పలికింది. పెసర 44క్వింటాళ్లు, మినుము 5క్వింటాళ్లు విక్రయాలు జరిగాయని అధికారులు తెలిపారు.

కేవీపీఎస్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

యాలాల, సెప్టెంబరు 21 : కేవీపీఎస్ జిల్లా నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య, సహాయ కార్యదర్శులు ఎడ్ల సురేష్, డి.నర్సింహులు, ఉపాధ్యక్షులు బి.రాజు, మాదారం యాదయ్య, ఉపాధ్యక్షుడు ప్రభు, సహాయ కార్యదర్శిగా నర్సిములు, జిల్లా కార్యవర్గ సభ్యులుగా నర్సింహులు, కమిటీ సభ్యులుగా రాజులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మల్కయ్య మాట్లాడుతూ జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులు, సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని అన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్సైకి సన్మానం

కులకచర్ల, సెప్టెంబరు 21: నూతన సివిల్ ఎస్సైగా ఎన్నికైన చౌడాపూర్ మండలంలోని మక్త వెంకటాపూర్ గ్రామానికి చెందిన జబీనా బేగాన్ని శనివారం సన్మానించారు. మక్త మొహ్మద్ షరీఫ్-దౌలాత్‌బేగం దంపతుల కుమార్తెలు జాబీనాబేగం సివిల్ ఎస్సై, అఫ్రీన్ బేగంకు కానిస్టేబుల్ ఉద్యోగాలు రావడంతో శిక్షణ పొందారు. సివిల్ ఎస్సై జబీనాబేగం గ్రామానికి రావడంతో ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్.అశోక్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.



జబీనాను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకుడు అశోక్‌కుమార్

మళ్లీ ఇందిరమ్మ రాజ్యం



పెద్దేముల్ మండల పరిషత్‌లో గ్యాస్ సబ్సిడీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్, సెప్టెంబరు 21: రాష్ట్రంలో మళ్లీ ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని, నిరుపేదలందరికీ త్వరలోనే ఇండ్లు, రేషన్ కార్డులు ఇస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దేముల్‌లో శనివారం రూ.500కే గ్యాస్ పథకానికి అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో సొంతపార్టీ వారికే సంక్షేమ పథకాలను వర్తింపజేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అలా జరగదన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ పథకాలను అమలు చేస్తామన్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టుకు ప్రభుత్వం రూ.110కోట్లు మంజూరు చేస్తుందన్నారు. బీఆర్ఎస్ పాలకులు కోట్‌పల్లి ప్రాజెక్టును పట్టించుకోలేదన్నారు. చెప్పింది చేస్తోంది కాంగ్రెస్ మాత్రమే అన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్, ప్రత్యేకాధికారి సత్యనారాయణ, తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో జర్లప్ప, ఏఎంసీ చైర్మన్ అంజయ్య, కాంగ్రెస్ నాయకులు గోపాల్, ఎల్లారెడ్డి, ప్రవీణ్‌కుమార్ గుప్తా, నారాయణరెడ్డి, శోభారాణి, నసీర్, కోహీర్ రవి, బాబ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్: తాండూరు నియోజకవర్గంలో యువతకు వృత్తి నైపుణ్యం కోసం క్యాంప్ ఆఫీస్ సమీపంలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. తాండూరు మండల పరిషత్ వద్ద గ్యాస్ సబ్సిడీ పత్రాలు, కల్యాణలక్ష్మి చెక్కులను డీసీసీబీ ఉపాధ్యక్షుడు ఎస్.రవీందర్‌గౌడ్‌తో కలిసి అందజేశారు. పదేళ్లపాటు తాండూరు నియోజకవర్గం వంచనకు గురైందన్నారు. తాండూరు ప్రాంతంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేసి ఐదో తరగతి నుంచి ఇంటర్ విద్యనందిస్తామన్నారు. త్వరలోనే కొత్త వారికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. జిల్లా కాంగ్రెస్ బీసీ నాయకుడు ఉత్తంచంద్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం అనేక పథకాలను అమలుచేస్తోందన్నారు. వారిని ఆర్థికకష్టాల్లోంచి బయటవేయడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ ఉపాధ్యక్షుడు రవీందర్‌గౌడ్, తహసీల్దార్ తారాసింగ్, ఎంపీడీవో విశ్వప్రసాద్, కాంగ్రెస్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ ధారాసింగ్, తాండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెర్ల నాగప్ప, మాజీ ఎంపీపీ శరణుబసప్ప, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు మేఘనాథ్‌గౌడ్, బుడ్డెల్లి సాయిలు, కాంగ్రెస్ యువ నాయకులు అనిల్, రాందాస్, హరీశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అజ్మత్‌అలీ, ఉదయభాస్కర్‌రెడ్డి, ఎస్.పండరి, రాముయాదవ్, పురుషోత్తంరెడ్డి, కరన్‌కోట్ జగదీష్ పాల్గొన్నారు.

గ్యాస్ సబ్సిడీ మంజూరు పత్రాల పంపిణీ

కొడంగల్: కొడంగల్‌లోని రేషన్ దుకాణం-2లో గ్యాస్‌సబ్సిడీ పత్రాలను అందజేశారు. రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి పత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీహామీని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, కౌన్సిలర్లు మధుసూదన్‌యాదవ్, శంకర్‌నాయక్, వెంకట్‌రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్: మండలంలోని యాంకిలో పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్ లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీలర్ కిష్టప్ప, కాంగ్రెస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మల్‌రెడ్డి, మాణిక్యప్ప, సున్నపు శివ, బసంత్, చిత్రకళాకారుడు అశోక్ పాల్గొన్నారు.



యాంకిలో లబ్ధిదారులకు సబ్సిడీ పత్రాలు అందజేస్తున్న కార్యదర్శి అశోక్‌కుమార్

క్రైం కార్నర్

లారీ ఢీకొని మహిళ దుర్మరణం

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 21: రోడ్డు దాటుతున్న మహిళను లారీ ఢీకొనడంతో మృతిచెందిన ఘటన మేడ్చల్‌లో చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్‌లోని హాస్టల్‌లో ఉంటున్న రాగటి జ్యోతి(30) శనివారం ఆర్టీసీ డిపో వద్ద రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. జ్యోతి మంథని నుంచి వలసొచ్చి కొంపల్లిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తోందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి అస్తిపంజరం లభ్యం

మర్పల్లి, సెప్టెంబరు 21: పట్లూర్ శివారులో గుర్తుతెలియని వ్యక్తి అస్తిపంజరం లభ్యమైందని ఎస్సై సురేశ్ తెలిపారు. పట్లూర్‌లోని చామంతి బలరామరాజు ఫాంహౌస్‌లో వాచ్‌మ్యాన్‌గా పనిచేస్తున్న నాగేశ్వర్ ఓ వ్యక్తి అస్తి పంజరం ఉందని శుక్రవారం రాత్రి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించగా కొన్నిరోజుల క్రితమే మృతిచెందిన వ్యక్తి బొక్కలే మిగిలాయి. శవానికి సంబంధించి ఆనవాళ్లు లేకపోవడంతో పోస్టుమార్టం కోసం వికారాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



బేగరి నర్సింలు(ఫైల్)

బంట్వారం(కోట్‌పల్లి), సెప్టెంబరు 21: భార్య కాపురానికి రాలేదని ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కోట్‌పల్లి మండలంలో శనివారం జరిగింది. ఎస్సై స్రవంతి తెలిపిన వివరాలు ప్రకారం.. మోత్కుపల్లికి చెందిన బేగరి నర్సింలు(42), భార్య హేమలత కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో కూలి పనిచేస్తూ జీవనం సాగించారు. 15రోజుల క్రితం గ్రామానికొచ్చారు. డబ్బు విషయంలో భార్య గొడవపడి హైదరాబాద్‌కు పోయింది. మనస్థాపానికి గురైన నర్సింలు ఇంట్లో చున్నీతో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. నర్సింలు తమ్ముడు ఆనందం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించారు. నర్సింలు దంపతులకు ఇద్దరు ఆడ పిల్లలు. పెద్దమ్మాయికి పెళ్లయింది. చిన్నమ్మాయి పదోతరగతి చదువుతోంది.

వృద్ధురాలిపై లైంగికదాడి చేసిన ఇద్దరి రిమాండ్

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 21: వృద్ధురాలిపై లైంగికదాడి చేసిన ఇద్దరిని శనివారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. మేడ్చల్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. బండమాదారం ట్రాన్స్‌కో లైన్‌మన్ వెంకట్‌రావు(26), బిల్ కలెక్టర్ నవాజ్(20)లు ఓ వృద్ధురాలిపై లైంగికదాడి చేశారన్నారు. వెంకట్‌రావుకు భార్య లేదు. గురువారం రాత్రి తన కూతురికి అన్నం వండాలని ఓ వృద్ధురాలిని ఇంటికి తోలుకొచ్చాడు. ఆ వృద్ధురాలు అన్నం వండి వెంకట్‌రావు కూతురికి తినిపించి తనంటికి వెళ్తుండగా ఆపి తన కూతురికి తోడుగా ఈ రాత్రి ఇంట్లో పడుకోవాలని కోరాడు. దీంతో వృద్ధురాలు అక్కడే ఉంది. అప్పటికే నవాజ్, వెంకట్‌రావు పూటుగా మద్యం తాగారు. వృద్ధురాలికి బలవంతంగా మద్యం తాగించి లైంగికదాడి చేశారు. ఆమెను అక్కడే వదిలి నవాజ్ తనంటికి, వెంకట్‌రావు కూతురితో కలిసి తన అక్కవద్దకు వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం వెంకట్‌రావు తన ఇంటికి వచ్చేసరికి వృద్ధురాలు రక్తస్రావంతో బాధపడుతుండగా ఆమెను ఇంటినుంచి వెళ్లగొట్టాడు. తనకు జరిగిన అన్యాయంపై వృద్ధురాలు స్థానికులకు తెలుపింది. వెంటనే గ్రామస్తులు 108కు ఫోన్‌చేసి వృద్ధురాలిని మేడ్చల్ ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు చేరుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మెడికల్‌రిపోర్టులు పరిశీలించి కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్ తరలించామని సీఐ తెలిపారు.

భూ తగాదాలతో మామిడి తోట ధ్వంసం

బొంరాస్‌పేట్, సెప్టెంబరు21:భూ తగాదాలతో మామిడి తోటను ధ్వంసం చేసిన ఘటన మండలంలో జరిగింది. ఏర్పుమళ్ల పంచాయతీ పరిధి కాకర్లగుండి తండాలో మూడవత్ లక్ష్మీబాయి భర్త మాణిక్యం, అదే తండాకు చెందిన కర్రె బాల్యానాయక్ మధ్య భూతగాదాలున్నాయి. సర్వే నం 406, 407లలో తగాదా ఉంది. ఐదారేళ్లుగా జరుగుతున్న గొడవల్లో బాల్యానాయక్ ఎక్స్‌కవేటర్‌తో మామిడి చెట్లను ధ్వంసం చేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్సై అబ్దుల్ రవూఫ్ చేరుకొని విచారణ చేస్తామని తెలిపారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

కులకచర్ల, సెప్టెంబరు 21: మండలంలోని అనంతసాగర్‌లో టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం రాత్రి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. వైకుంఠధామం వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 6సెల్‌ఫోన్‌లు, రూ.7,600 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారంతో దాడి చేశామన్నారు.

పరిసరాల పరిశుభ్రత కోసం పాటుపడాలి



అన్నోజిగూడ ఆలయంలో శుభ్రం చేయిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్, సెప్టెంబరు 21: పరిసరాల పరిశుభ్రతకు ప్రతీ ఒక్కరు కృషిచేయాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా మున్సిపల్ సిబ్బందితో కలిసి అన్నోజిగూడలో ఆలయాలు, పరిసరాలను శుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రతలోనే ఆరోగ్యం దాగిఉందన్నారు. ఇప్పటికే మున్సిపల్ సిబ్బంది ఆరు రోజులుగా స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అలాగే మున్సిపల్ ఉద్యోగులు వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా ఇవ్వాలని సూచించారు. రాజేష్, యోగిశ్వర్, మారుతి పాల్గొన్నారు.

శామీర్‌పేట: ప్రతీ ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ పిలుపునిచ్చారు. పట్టణంలో స్వచ్ఛ సర్వేక్షణ్-2024 నిర్వహించారు. పాఠశాలల విద్యార్థులు, మహిళలు, సిబ్బంది స్వచ్ఛతా హీ సేవపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వార్డుల్లో, కాలనీల్లో రోడ్లపై చెత్తచెదారాన్ని సిబ్బంది తొలగించారు. అనంతరం ప్రభుత్వ స్థలాల్లో కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రేణుక, కౌన్సిలర్లు మొక్కలు నాటారు.



తూంకుంట స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విద్యార్థులు, అధికారులు

పౌష్టికాహార లోపం రాకుండా జాగ్రత్తపడాలి



నాగారంలో గర్భిణికి సీమంతం నిర్వహిస్తున్న మహిళలు, ప్రజాప్రతినిధులు

కీసర, సెప్టెంబరు 21: బాలింతలు, గర్భిణులు స్త్రీలు, చిన్నారుల్లో పౌష్టికాహారం లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కె.చంద్రారెడ్డి అన్నారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా 30వ తేదీ వరకు పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం 18వ వార్డులోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో మహిళలకు పౌష్టికాహారం అందజేశారు. ముఖ్య అతిథి చంద్రారెడ్డి మాట్లాడుతూ చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం లోపించకుండా ఉండేందుకు మోదీ ప్రభుత్వం పోషన్ అభియాన్ ప్రథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీఓ శారద, మున్సిపల్ చైర్మన్ చంద్రశేఖర్, కౌన్సిలర్ హరిబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: పోషకాహార లోపాన్ని నివారించేందుకు కృషిచేయాలని సీడీపీవో శారద అన్నారు. ఉద్దెమర్రిలో పోషణ మాసోత్సవాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం సామూహిక సీమంతాలు, అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగమణి, రేణుక, సీహెచ్‌వో, ఎంపీహెచ్‌వో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: కొత్త కోల్కుంద అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ వారోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు పౌష్టికాహారంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. చిరు ధాన్యాలు, కూరగాయల లాంటివి తల్లులు తీసుకోవాలని సూచించారు. అనంతరం పిండి వంటలు, చిరుధాన్యాలు, కూరగాయలతో పాటు ఆకుకూరల ప్రయోజనాలపై ప్రదర్శనతో అవగాహన కల్పించారు.అంగన్‌వాడీలు, ఆశాలు విజయ, కవిత, అరుణ, భాగ్యమ్మ పాల్గొన్నారు.



కొత్త కోల్కుంద అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాస వారోత్సవాలు

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

యాలాల, సెప్టెంబరు 21:ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం యాలాల యాలాల మండల పరిషత్‌లో టీచర్లను సన్మానించారు. మొత్తం 23మంది ఉపాధ్యాయులను మండల పరిషత్ తరఫున సన్మానించారు. మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసి పేరుప్రతిష్టలు సంపాదించాలని సూచించారు. విద్యార్థులకు విద్యతోపాటు వినయ విధేయతలు నేర్పించాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అనంతయ్య ముదిరాజ్, ఎంఈవో సుధాకర్‌రెడ్డి, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, భాను చైతన్య రాములు, నరహరిరెడ్డి, మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

బొంరాస్‌పేట్: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వారోత్సవాల సందర్భంగా మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులను బొంరాస్‌పేట్ విద్యావనరుల కేంద్రంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించారు. 9 మంది ఉత్తమ ఉపాధ్యాయులు ప్రశాంత్‌కుమార్, శరణప్ప, శివకుమార్, సత్యవతి, సీమాపర్వీన్, సునీత, మహేశ్వరి, కావేరి, సోమ్లలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో రామ్‌రెడ్డి, నోడల్ అధికారి హరిలాల్, జీహెచ్‌ఎం రవీందర్‌గౌడ్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు గౌరారం గోపాల్, నరేందర్‌గౌడ్, బాకారం చంద్రశేఖర్, మల్లయ్య, అనిల్‌కుమార్, శశిధర్, మల్లేశ్, రూ ప, ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట్ మండల ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సంఘాల నాయకులు



బ్యాగులు పంపిణీ చేస్తున్న టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ తదితరులు

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 21: కిసాన్ బంధు స్వచ్ఛంద వారి సంస్థ సహకారంతో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. శనివారం బొంరాస్‌పేట్ మండలంలోని ఎన్కెపల్లి, టేకులగడ్డ తండా, పూర్యానాయక్ తండా, దుద్యాల్ పాఠశాలల్లో తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా కిసాన్ బంధు స్వచ్ఛంద సంస్థ సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. నిరుపేదలు, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సతీశ్, సాయి, నిత్య హెచ్‌ఎంలు చంద్రశేఖర్, అనిల్‌కుమార్, గౌరారం గోపాల్, అబ్దుల్ హక్, నవీన్‌కుమార్, రహీం, హకీం బాల్‌రాజ్, అమ్మనాన్న ఫౌండేషన్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

టైలు, ఐడీ కార్డుల అందజేత

దోమ, సెప్టెంబరు 21: దోమ మండల పరిధి ఐనాపూర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు టై, గుర్తింపు కార్డులు, బెల్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాబుచందు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని సూచించారు. బాగా చదివి తల్లిదండ్రులకు, చదువు చెప్పిన ఉపాధ్యాయులకు పేరు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మేఘ్య, గ్రామస్థులు గోవర్ధన్, ఉపాధ్యాయులు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



ఐనాపూర్ పాఠశాలలో విద్యార్థులకు అందించిన గుర్తింపు కార్డులు

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం



జెనీవాలో ఉగ్రవాద బాధితుల ఫొటోల ప్రదర్శిస్తూ వివరిస్తున్న సాయి, సంపత్‌కుమార్

బషీరాబాద్, సెప్టెబర్ 21: ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటంచేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు ఇకో ఫాన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు, బషీరాబాద్ యువకులు మెట్టు సాయి, సంపత్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ నెల 20న స్విజర్లాండ్ దేశం జెనీవాలో యునైటెడ్ నేషన్స్ బ్రోకెన్ చెయిర్ వద్ద ఉగ్రవాద బాధితుల ఫొటోలను ప్రదర్శించామని తెలిపారు. ఉగ్రవాదంతో భారత్‌లో నష్టపోయిన కుటుంబాల కష్టాలపై ఫొటో ప్రదర్శన ఇచ్చామన్నారు. కార్యక్రమంలో దౌత్యవేత్తలు, ఎన్‌జీవోలు, మానవ హక్కుల ప్రతినిధులు పాల్గొన్నారని వివరించారు.

పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

దౌల్తాబాద్, సెప్టెంబరు 21: పీఆర్‌టీయూ నూతన కార్యవర్గాన్ని శనివారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భీమప్ప, ప్రధాన కార్యదర్శిగా పెంట్యానాయక్, గౌరవ అధ్యక్షుడిగా భీమ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలిగా రేణుక, కార్యదర్శిగా సుభాష్‌రెడ్డిలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఎంబీసీ కో-కన్వీనర్‌గా సాల్వేరు రఘు



ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 21: బీజేపీ జిల్లా ఎంబీసీ కో-కన్వీనర్‌గా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్‌కు చెందిన సాల్వేరు రఘు నియమితులయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, కార్యదర్శి తిరుమల్‌రెడ్డి శనివారం రఘుకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు మహేష్‌యాదవ్, నాయకులు రామోజీ, గొంగళ్ల మహేష్, అంజనేయులు, ఎదుగని శ్రీరాములు, మండల అధ్యక్షుడు చలువాది ప్రవీణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

సంప్రద ఆసుపత్రిలో రక్తదాన శిబిరం

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 21: మేడ్చల్‌లోని సంప్రద మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్లు, సిబ్బంది రక్తదానం చేశారు. ఆస్పత్రి చైర్మన్ సందీప్ మాట్లాడుతూ.. ఈ నెలాఖరు వరకు తమ ఆస్పత్రిలో ఓపీడీ సేవలు ఉచితంగా నిర్వహిస్తున్నామని, స్థానికులు వినియోగించుకోవాలని కోరారు.

బషీరాబాద్ మండలంలో 38,852 మంది ఓటర్లు

● పురుషుల కంటే మహిళలే అధికం

బషీరాబాద్, సెప్టెంబరు 21: బషీరాబాద్ మండలంలో 39గ్రామ పంచాయతీలకు గాను 312 వార్డుల పరిధిలో 38,852 మంది ఓటర్లు ఉన్నారు. ఇటీవల మండల పరిషత్ అధికారులు విడుదల చేసిన ఓటరు ముసాయిదా ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో పురుషుల కంటే మహిళల ఓట్లే అధికంగా ఉన్నాయి. 18,869 పురుషులు ఉండగా, 20,869 మహిళల ఓట్లు నమోదయ్యాయి. పురుషుల కంటే మహిళల ఓట్లు 1,886 ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇదిలా ఉండగా త్వరలో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అధికారులు ఒక్కొక ప్రక్రియను కొనసాగిస్తూ ముందుకెళ్తున్నారు. మండలంలో ఈ సారి కొత్తగా ఏర్పాటైన మల్కన్‌గిరి, గంగ్వార్, పర్శ్యానాయక్‌తండాల్లోని మూడు పంచాయతీల ఓటర్లను కూడా విభజించి ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించారు. ఇప్పటికే అధికారులు ఓటర్ల లిస్టు జాబితాలో అభ్యంతరాలుంటే తెలియజేయాలని ఓటరు లిస్టులను పంచాయతీల్లో ప్రదర్శించారు. ఈ నెల 28న తుది జాబితా విడుదల కానుందని, అంతకు ముందే ఓటరు లిస్టులో తప్పులుంటే సవరించుకోవాలని బషీరాబాద్ ఎంపీవో బాలగంగాదర్‌చారి ఈ సందర్భంగా తెలిపారు.

నేటి ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మోమిన్‌పేట్, సెప్టెంబరు 21: ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మా శారద ఆసుపత్రి వైద్యుడు కొప్పుల రాజశేఖర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మా శారద, ఆసుపత్రి, ఎన్కెపల్లి వికారాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం మేకతివనంపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని ఆయన తెలిపారు. శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పట్టణంలో పలు చోట్ల విద్యుత్ అంతరాయం

వికారాబాద్, సెప్టెంబర్ 21 : విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా ఆదివారం వికారాబాద్ పట్టణంలో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 3.30గంటలకు వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని డీఈ సంజీవ్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు అంత సహకరించాలని కోరారు.

అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలి

తాండూరు, సెప్టెంబరు 21: తాండూరు మున్సిపాలిటీలో 39 ఎకరాల్లో అక్రమ లేఅవుట్ చేసిన వారిపై క్రిమినల్ కేసు నమోదుచేయాలని మాజీ కౌన్సిలర్ ఠాకూర్‌సూరజ్‌సింగ్ కలెక్టర్, తహసీల్దార్లకు శనివారం ఫిర్యాదు చేశారు. పట్టణంలోని సాయిపూర్‌లోని సర్వే నంబర్ 4, 6, 7, 142, 143, 129లలో దొంగతనంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. సర్వేనంబర్ 129, 130లలో క్రయవిక్రయదారులపై చర్యలు చేపట్టాలన్నారు.కుర్షీద్‌అలీ ఆస్తిని ముక్తార్ అలీ, అన్వర్ అలీ, నాసిర్ అలీలు బదిలీ చేసుకున్నారని, 10శాతం భూమి మార్ట్‌గేజ్ చేయకుండానే లేఅవుట్ చేశారని తెలిపారు.

159వ సారి డాక్టర్ సంపత్ రక్తదానం



రక్తదానం చేస్తున్న సంపత్‌కుమార్

తాండూరు, సెప్టెంబర్ 21: కంసాన్‌పల్లికి చెందిన లక్ష్మికి మొదటి కాన్పు సమయంలో రక్తం అవసరం కావడంతో గ్రామస్థులు డాక్టర్ సంపత్ కుమార్‌కు తెలియజేశారు. ఆయన స్పందించి రక్తదానం చేశారు. సంపత్‌కుమార్ ఇప్పటి వరకు వైద్యసేవలే కాకుండా అత్యవసర రోగులకు రక్తదానం చేస్తు వచ్చారు. లక్ష్మికి 159వ సారి రక్తదానం చేసి తన ఉదారతను చాటుకున్నారు.

వేంకటేశ్వరుడి లడ్డూ తయారీలో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



మల్లేశ్‌యాదవ్

మర్పల్లి, సెప్టెంబరు 21 : పవిత్రమైన తిరుమల లడ్డూ తయారీలో కల్తీ చేసి అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్‌యాదవ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ హిందువులు పవిత్రంగా భావించే తిరుమల లడ్డూను కల్తీ చేయడం బాధాకరం అన్నారు. నిత్యం వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకొని తీసుకునే లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయడం క్షమించరాని నేరం అన్నారు. వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

నీరజ్ ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో సైన్స్ ఫేర్

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 21: గుండ్లపోచంపల్లి పరిధి కండ్లకోయలో గల నీరజ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం సైన్స్‌ఫేర్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు దేశ చరిత్రను చాటే పురాతన కట్టడాలు, గ్రామీణ సంస్కృతులు, కళలకు సంబంధించిన వస్తువులను చేసి సైన్స్‌ఫేర్‌లో ప్రదర్శించారు. విద్యార్థులు ఎగ్జిబిట్లను నీరజ్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ బి.జ్యోతిరెడ్డి తిలకించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు యాజమాన్యం బహుమతులు అందజేసింది. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు శ్రీదేవిరెడ్డి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్‌పర్సన్ జ్యోతిరెడ్డి